## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో హోమాలు



గుమ్మడి అమ్మలు పేరంటాలు ఆలయం

రాంబిల్లి : కొత్తూరులో గుమ్మడి అమ్మలు పేరంటాలు ఆలయం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. సుందరపు విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు తమ ఇలవేల్పు కావడంతో సొంత నిధులతో ఆలయాన్ని నిర్మించారు. అమ్మవారి కొత్త విగ్రహాన్ని ఈ నెల 4న ప్రతిష్ఠ చేయనున్నారు. ఇందులో భాగంగా గురువారం హోమం, ఇతర పూజలు నిర్వహించారు. శనివారం ఆలయం ప్రారంభం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు.

### అర్హులందరికీ పింఛన్ల మంజూరు



గవర్ల అనకాపల్లిలో డయాలసిస్ పింఛను అందజేస్తున్న దృశ్యం

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తున్నామని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లికి చెందిన డయాలసిస్ రోగి ద్రాక్షారపు రమణకు గురువారం రూ.10వేల పింఛన్‌ను ఆయన అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

### నిర్మాణ కార్మికురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అనారోగ్యంతో బాధపడుతున్న భవన నిర్మాణ కార్మికురాలు టి.లక్ష్మికి మణికంఠ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆర్.అప్పలనాయుడు గురువారం రూ. పది వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నిర్మాణ కార్మికుల్ని సంక్షేమ బోర్డు ద్వారా ఆదుకోవాలని ఈ సందర్భంగా పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, సోము నాయుడు, పైడిరాజు, నాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

### బ్యాడ్మింటన్ క్రీడాకారులకు జెర్సీల పంపిణీ



బ్యాడ్మింటన్ క్రీడాకారులతో ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి : బ్యాడ్మింటన్‌లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. గురువారం యలమంచిలి కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లాకు చెందిన అండర్ 14,17 బాలబాలికల బ్యాడ్మింటన్ క్రీడాకారుల శిక్షణ శిబిరంను ఆయన సందర్శించి తన సొంత నిధులతో క్రీడాకారులకు ఉచితంగా జెర్సీలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజాన మహాలక్ష్మి, కొల్లి రజనీ త్రినాథ్, కౌన్సిలర్స్ పిట్టా సత్తిబాబు, దూది నరసింహమూర్తి, ఎంఈవో అరుణ్‌కుమార్, వీర, తాడి, ఏసుదాసు పాల్గొన్నారు.

### ఉపాధి పథకం ద్వారా గ్రామాల అభివృద్ధి

మునగపాక : ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పథకం గ్రామసభ నిర్వహించారు. ఈ పథకం ద్వారా రహదారులు, డ్రైనేజీలు, కాలువలు, చెరువుల అభివృద్ధి పనులకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామసభల ద్వారా చేపట్టనున్న పనులకు సంబంధించి ఆమోదం అవసరమన్నారు. ఎంపీడీవో మన్మథరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో ఎరకయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, పంచాయతీ వార్డు సభ్యులు, కూలీలు పాల్గొన్నారు.



# జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం

- వైద్య శిబిరాలకు విశేష స్పందన
- యలమంచిలి పట్టణం, మండలంలో 5027 మందికి వైద్య పరీక్షలు
- స్పెషలిస్టు వైద్యులతో చికిత్స



రోగికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



ఏటికొప్పాకలో శిబిరానికొచ్చిన ప్రజలు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): ప్రజల హక్కుగా ఆరోగ్య భాగ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది.పేదల ఆరోగ్యానికి భరోసానిస్తున్నారు ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రతి ఇంటా జల్లెడ పడుతూ ప్రజల అనారోగ్య సమస్యలు తెలుసుకుని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలోనే అవసరమైన స్పెషలిస్టు వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రజల నుంచి ప్రశంసలు అందుతున్నాయి. గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు,ఇద్దరు వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది సేవలందిస్తున్నారు. దీనిలో భాగంగా యలమంచిలి పట్టణం,మండలంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. వేలాది మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు.

**5027 మందికి వైద్య పరీక్షలు**

అక్టోబరు 30 తేదీన రాష్ట్రంలో ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రారంభించారు.వైద్య శిబిరాలు ప్రారంభమైన తర్వాత యలమంచిలి మున్సిపాలిటీలో ఐదు, మండలంలో 9 మొత్తం 14 శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో 5027 మందికి వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.వారిలో 375 మందిని మెరుగైన చికిత్సల కోసం పెద్దాసుపత్రులకు రిఫర్ చేశారు.వారందరికీ వేర్వేరు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్సలు అందించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది.శిబిరాలకు వచ్చిన వారిలో 5 వేల మందికి ఉచితంగా మందులు అందజేశారు.

**పలు వ్యాధులకు చికిత్స**

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు వచ్చిన వారిలో పోషకాహార లోపం ఉన్నవారు, గర్భిణులు, బాలింతలు, గర్భకోశ వ్యాధులున్న వారు, రక్తహీనత ఉన్న వారు, వృద్ధాప్య సమయంలో వివిధ సమస్యలతో బాధపడుతున్నవారు, హైపర్ టెన్షన్ ఉన్నవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు హైపోథైరాయిడ్ రోగులు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వీరితో పాటు వేలాది మందికి కంటి వెలుగు ద్వారా కంటి వైద్య పరీక్షలు చేశారు. వారిలో అవసరమైన వారికి కళ్ల అద్దాలు అందజేశారు. కొందరికి క్యాటరాక్ట్ అవసరమని నిర్ధారించారు.

**పోషకాహారంపై అవగాహన :** ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలకు స్పెషలిస్టు వైద్యులు వచ్చి పరీక్షలు చెస్తుండడంతో వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన లభించింది. శిబిరాలు జరుగుతున్న చోటుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి వైద్య సేవలు పొందారు. చికిత్స తర్వాత ఇవ్వడానికి 172 రకాల మందులు ఉచితంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉంచడాన్ని చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు. ఇక వివిధ వ్యాధులకు ప్రధాన కారణమైన పోషకాహార లోపంపై అవగాహన కల్పించడానికి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార స్టాల్స్ ఆకట్టుకున్నాయి. వివిధ ఆకుకూరలు, వెజిటబుల్స్, మిల్లెట్స్ వంటకాలను శిబిరాల్లో ప్రదర్శించడమే కాకుండా వాటి వినియోగం, ప్రయోజనాలను ప్రజలకు అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు.

### ప్రజల నుంచి విశేష స్పందన



మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహించాం.10 గ్రామ సచివాలయాల పరిధిలో 9 వైద్య శిబిరాలు జరిగాయి. ముందుగానే అవసరమైనవారిని గుర్తించి వారిని శిబిరాలకు తీసుకొచ్చి వైద్యం అందించాం.ఆస్పత్రుల్లో చికిత్సలు అవసరమైన 262 మందిని రిఫర్ చేశాం.వారు అక్కడ చికిత్స పొంది ఇంటికి వచ్చే వరకూ మానిటరింగ్ చేస్తుండడం మరో గొప్ప విషయం.

– కె.అప్పలనాయుడు, ఎంపీడీవో, యలమంచిలి

### పేదలకు మేలు జరిగింది



పట్టణాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోలేని పేదలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. న్యూరాలజీ, ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు అవసరం ఉన్నవారు ఆరోగ్యశ్రీలో వైద్యం అందేలా చర్యలు తీసుకున్నాం. వేలాది మంది శిబిరాలకొచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా పక్కాగా శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం రూపొందించిన కార్యాచరణ అద్భుతంగా ఉంది.

-కె.ఎ.కొండలరావు, మున్సిపల్ కమిషనర్, యలమంచిలి

# తాగునీటి సమస్య పరిష్కారం



చేతి బోరును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

పాయకరావుపేట : ప్రతి గ్రామంలోను తాగునీరు సమస్య పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని, అందుకోసం కోట్లాది రూపాయలు ప్రభుత్వం విడుదల చేస్తోందని జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గల అంగన్‌వాడీ కేంద్రం వద్ద నూతనంగా నిర్మించిన చేతి బోరును జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు ప్రారంభించారు. జిల్లా పరిషత్ గ్రాంటు నుంచి ప్రతి గ్రామంలో చేతి బోరులు ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కళ్యాణ్ మనోజ్, ఈవో ఆర్‌డీ చంద్రశేఖర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌజన్య పాల్గొన్నారు.

## సీపీఎం బస్సు యాత్రను విజయవంతం చేయాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం (అనకాపల్లి): అసమానతలు లేని సమాజం కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న బస్సు యాత్ర ఈ నెల 5న అచ్యుతాపురం చేరుకుంటుందని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం కన్వీనర్ ఆర్.రాము కోరారు. అచ్యుతాపురం మండలంలోని పూడి, కుమారపురం గ్రామాల్లో గురువారం బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. పరిశ్రమల ఏర్పాటుతో కాలుష్య కోరల్లో చిక్కుకున్న చిన్నపూడి, చిన్న తాళ్లదిబ్బ, దుప్పుతూరు గ్రామాలను తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో కె.సోమునాయుడు, రాజన్న, సత్తిబాబు, అమ్మాజీ, రమణమ్మ, అప్పలరాజు పాల్గొన్నారు.

## ఘనంగా సాంబశివుని రాట మహోత్సవం



మునగపాకలో సాంబశివుని రాట మహోత్సవంలో భక్తులు

మునగపాక : గ్రామంలో సాంబశివుని రాట మహోత్సవం గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేపచెట్టుకు కుంకుమ, పసుపు అద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 27న సాంబశివుని శూలాల మహోత్సవంలో భాగంగా ముందస్తుగా రాట మహోత్సవం గ్రామస్తుల సహకారంతో ఘనంగా జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, పెద్దలు దాడి శ్రీరామమూర్తి, వేగి కృష్ణ, పెంటకోట జగ్గప్పారావు, ఆడారి కాశీబాబు, బొడ్డేడ మహేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జంగిల్ క్లియరెన్సు చేపట్టరూ..



నీలిగుంట రహదారిని కమ్మేసిన పిచ్చిమొక్కలు

కోటవురట్ల : రహదారులను పిచ్చిమొక్కలు కమ్మేశాయి. మలుపుల్లో ఎదుట వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సుమారు ఏడాదిగా అధికారులు జంగిల్ క్లియరెన్సు చేపట్టలేదు. దాంతో మండలంలోని ఏ గ్రామానికి వెళ్లే రహదారిని చూసినా పిచ్చిమొక్కలే దర్శనమిస్తున్నాయి. నర్సీపట్నం-రేవుపోలవరం మెయిన్‌రోడ్డుతో సహా లింగాపురం-కొడవటిపూడి, అన్నవరం, రాజుపేట, పాతరోడ్డు-చౌడువాడ, బి.కె.పల్లి-నీలిగుంట రహదారులను పిచ్చిపొదలు మూసేశాయి. దీంతో మలుపుల్లో ఎదుట వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్సు చేయించాలని పలువురు కోరుతున్నారు.

### విద్యుత్ ఉద్యోగుల ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అచ్యుతాపురం డివిజన్ ఉద్యోగులు గురువారం సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ ప్రతిజ్ఞ నిర్వహించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూసుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు.

### భూ ఆక్రమణలపై చర్యలు తప్పవు

ఎస్.రాయవరం : ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తిమ్మాపురం వీఆర్వో నూకరాజు హెచ్చరించారు. అడ్డురోడ్డు కేంద్రం ఉన్న ఈ గ్రామంలో వాణిజ్య పరంగా అభివృద్ధి జరగడంతో అక్రమార్కులకు ప్రభుత్వ భూములపై కన్ను పడ్డాయి. కొందరు జిరాయితీ భూములు అనుకుని ఉన్న భూములను, మరికొన్ని నేరుగా ప్రభుత్వ భూములనే కలుపుకుని నివాసాలు, దుకాణాలు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో వీఆర్‌వో హెచ్చరించారు.

### 26న మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు

తుమ్మపాల: గవరపాలెం శ్రీగౌరీ వ్యాయమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న జరగనున్న ' 27వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్' పోటీల పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, చీఫ్ అడ్వైజర్ కె.గురునాథరావు, అధ్యక్షుడు కోరిబిల్లి సోమునాయుడు తదితరులు ఆవిష్కరించారు.

### కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నేడు..

కోటవురట్ల : సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కన్వీనర్లు, గృహసారథులతో శుక్రవారం సమావేశం నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్ సీతారామరాజు, జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి పాల్గొంటారని తెలిపారు. ప్రధానంగా సామాజిక సాధికార బస్సు యాత్ర, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాలపై అవగాహన ఉంటుందని తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

### ఏపీసీపీఎస్ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శిగా త్రినాథ స్వామి



మోటూరు త్రినాథ స్వామి

అచ్యుతాపురం(అనకాపల్లి) : అనకాపల్లి జిల్లా ఏపీసీపీఎస్ఈఏ ప్రధాన కార్యదర్శిగా అచ్యుతాపురం మండలానికి చెందిన మోటూరు త్రినాథ స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన గతంలో ఏపీటీఎఫ్‌లో కీలక పదవుల్లో కొనసాగారు. కాగా ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ వచ్చే వరకూ రాజీ లేని పోరాటం చేస్తామని అన్నారు.

### మాదిగ మహాసభను జయప్రదం చేయండి

పాయకరావుపేట : ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మాదిగల మహా సభను ఎంఆర్‌పీఆర్ ముఖ్య నాయకులు అందరూ విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ నియోజక ఇన్‌ఛార్జి గంపల చినరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై ఈ నెల 4 న పాయకరావుపేటలో ఎంఆర్‌పీఎస్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

### మునగపాక ఉపసర్పంచ్ రాజీనామా

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాక ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో మన్మథరావుకు రాజీనామా పత్రం అందజేశారు.12వ వార్డు సభ్యునిగా ఎన్నికైన సత్యనారాయణ వ్యక్తిగత కారణాలతో ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేసినట్టు తమకు లేఖపూర్వకంగా తెలియజేశారని ఎంపీడీవో తెలిపారు.

## ఎండిన వరిపొలాలు పరిశీలన



పంచదార్ల గ్రామంలో ఎండిపోతున్న వరి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం, సీపీఎం నాయికులు

రాంబిల్లి : వర్షాభావం కారణంగా రాంబిల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు కోరారు. గురువారం ఆయన రైతు సంఘం, సీపీఎం నాయకులతో కలిసి పంచదార్ల గ్రామంలో నీరు లేక ఎండిపోతున్న వరిపొలాలను పరిశీలించారు. లోటు వర్షపాతం నమోదు కావడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాము, సోమునాయుడు, దేముడునాయుడు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



మండల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ

పాయకరావుపేట : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గల స్త్రీ శక్తి భవన్‌లో ఎంపీపీ ఇసరపు పార్వతీ అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు కారణంగా మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని తీర్మానించాలని పాల్మన్‌పేట సర్పంచ్ కోడ కోటేశ్వరరావు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈదటం గ్రామంలో తాగునీటికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, పైపులైను ఏర్పాటుకు రోడ్లు కూడా తవ్వేశారని ఎంపీటీసీ కణసాల పద్మావతి సభకు తెలిపారు. గృహ నిర్మాణాలకు సిఫార్సు చేసినా అర్హులకు ఇంతవరకూ రుణాలు మంజూరు కాలేదని పాల్మన్‌పేట సర్పంచ్ కోటేశ్వరరావు అన్నారు. గతంలో గృహ నిర్మాణశాఖ మంజూరు చేసిన రుణాల ద్వారా ఇళ్ల నిర్మించుకున్న వారి వద్ద నుండి ఓటీఎస్ ద్వారా రూ.10 వేలు కట్టించుకొన్నారని, ఇంతవరకు వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేదని రెవెన్యూ అధికారులను పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నిలదీశారు. ప్రతి సమావేశానికి మత్స్యశాఖ ఇతర అధికారులు పూర్తిగా హాజరు కాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి కాలువలు, డామ్‌లు నిర్మాణానికి రూ.13 కోట్లతో ప్రతిపాదనలు పంపించడం జరిగిందని నీటి పారుదలశాఖ అధికారులు సభకు చెప్పారు. రోడ్లు, కల్వర్టులు మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందని ఏఈ సభకు విన్నవించారు. మండల పరిషత్ నిధులు ఇంతవరకు ఎంత ఖర్చు చేసారో వివరించాలని వైస్ ఎంపీపీ పల్లేల స్వామి కోరారు. ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరుకు ఆదేశాలు విడుదల చేసారని ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. కిడ్నీ, కుష్ఠు, తలసేమియా, లివర్, హార్ట్ తదితర దీర్ఘకాలిక రోగులకు రూ.5 వేలు పింఛను మంజూరు చేయడానికి అర్హులందరూ దరఖాస్తులు చేసుకోవచ్చునని సభలో ప్రకటించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, మండల కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, డీటీ కె.నూకరాజు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఈవో అరుణ్ కుమార్, ప్రధానోపాధ్యాయిని వరలక్ష్మి

యలమంచిలి : ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని ఎంఈవో అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పేట బయ్యవరం గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలకు గ్రామానికి చెందిన విద్యావేత్త యర్లు నారాయణరావు ఆర్థిక సహకారంతో 10 మంది 5వ తరగతి విద్యార్థులకు రూ.4వేలు విలువ చేసే నవోదయ స్టడీమెటీరియల్, విద్యార్థులు యోగా చేయడానికి వీలుగా రూ.3 విలువ చేసే టార్పిన్‌లు ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మితో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ దాతలు అందించిన స్టడీ మెటీరియల్ వినియోగించుకొని విద్యార్థులు నవోదయ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే



మోడల్ సర్వే ప్రశ్నాపత్రాన్ని చూపిస్తున్న ఎంఈవో వేణుగోపాలరావు

మునగపాక : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేకు సంబంధించి మోడల్ ప్రశ్నాపత్రాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని 17 పాఠశాలల్లో ఈ సర్వే జరుగుతుందని, ఇందుకు ఇన్విజిలేటర్లుగా స్థానిక ఎంఎస్‌ఆర్ నేషనల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొంటారని ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. 3,6,9 తరగతులు చదువుతున్న విద్యార్థుల పఠనా సామర్థ్యం తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ సర్వే నిర్వహిస్తుందన్నారు. 6 ప్రయివేటు స్కూళ్లు, 11 ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే సర్వే సక్రమంగా జరిగేలా సహకరించాలన్నారు. ఎంఈవో-2 శివనాయుడు, సీఆర్పీలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శాస్త్రీయ సలహాలు పాటిస్తే మేలైన దిగుబడులు



రైతులకు అవగాహన కలిస్తున్న ఏవో సుమంత

రాంబిల్లి : శాస్త్రీయ సలహాలు పాటిస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చునని ఏవో సి.సుమంత అన్నారు. కుమ్మరాపల్లి గ్రామంలో గురువారం వరి పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వరి యాజమాన్య పద్ధతులను వివరించారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు మేరకే ఎరువులు, క్రిమిసంహారక మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. యూరియాను అవసరం మేరకే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు గొల్లవిల్లి శ్రీనువాసరావు, చొప్పపట్ల ప్రకాశరావు, జనపరెడ్డి చిన్న పాల్గొన్నారు.

## చలో విజయవాడ విజయవంతం చేయాలి



రిక్షా కార్మికులతో కలసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకుడు కర్రి అప్పారావు

యలమంచిలి : ప్రజా రక్షణ భేరి సభను రిక్షా కార్మికులు విజయవంతం చేయాలని సీపీఎం నాయకుడు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. గురువారం యలమంచిలి పట్టణంలో రిక్షా కార్మికులతో కలసి చలో విజయవాడ ప్రజా రక్షణ భేరి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు తదితర అంశాలపై నవంబర్ 15వ తేదీన విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభకు అసంఘటిత కార్మికులు, రిక్షా కార్మికులు, మున్సిపల్ వర్కర్స్, చిరు వ్యాపారులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా యలమంచిలి పట్టణం, మండలంలో జంపపాలెం గ్రామంలో సీపీఎం మహాసభలపై ప్రచారం నిర్వహించారు.

## 18న హిందూ సాంస్కృతిక సమ్మేళనం



సమావేశమైన సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 18న హిందూ సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా కో-కన్వీనర్ పోతు రంగారావు అన్నారు.అచ్యుతాపురం మండల కేంద్రంలో శ్రీకృష్ణ, ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో గురువారం సమరసతా సేవా ఫౌండేషన్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మంలో కళలను ప్రదర్శించే అన్ని గ్రామాల ప్రజలను మండల కేంద్రంలో ఒక చోటకి చేర్చి కళలను ప్రదర్శించడంతో పాటు, సత్కరించనున్నట్టు ఆయన తెలిపారు. కార్తీక పౌర్ణమి రోజున దీపాలంకరణ, సామూహిక హారతి చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, రెడ్డి అప్పలనాయుడు, చోడిపల్లి సత్యం, కూండ్రపు రమణ, మేరుగు రాజారావు, నాని పాల్గొన్నారు.